ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర-కవిటీ : మండల కేంద్రమైన కవిటి శ్రీ చింతామణి ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ సభ్యులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గురువారం శ్రీచింతామణి అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 3 లక్షల 50 వేలు రూపాయలతో శ్రీ చింతామణి ట్రస్ట్(హైదారాబాద్) కవిటి వారి సహాయ సహకారం తో అమ్మవారి గుడి వద్ద అద్దె గదుల సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాండవ చంద్రశేఖర్, వైయస్ రమణ, పొల్లాయి లక్ష్మణ్ మూర్తి, ఏ కృష్ణారావు, పి ఉమామహేశ్వరరావు,బీపీ రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-సోంపేట : కంచిలి మండలం మకరాంపురం వద్ద డాక్టర్ వైఎస్సార్ సుజలధార పథకాన్ని ప్రారంభించేందుకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించారు. సోంపేట మండల సమస్యలను ఆయనకు వినతిపత్రం ద్వారా అందించారు. పైడిగాం ప్రాజెక్టు శాశ్వత మరమ్మతులు, సోంపేట మెయిన్‌రోడ్డు వైడ్నింగ్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

ఉద్దానం ప్రజలకు సుజలధార అంకితం

విశాలాంధ్ర-సోంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 700 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ సుజలధార పథకాన్ని ఉద్దానం ప్రజలకు అంకితం చేశారు. కంచిలి మండలం మకరాంపురం వద్ద అందుకు సంబంధించిన అండర్ గ్రౌండ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను గురువారం ప్రారంభించారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధుల నివారణ లక్ష్యంగా హిరమండలం వద్ద రిజర్వాయర్ నుంచి సుదూర ప్రాంతమైన ఉద్దానానికి తరలిస్తూ ఈ భారీ ప్రాజెక్టును ఏర్పాటుచేసిన విషయం తెల్సిందే. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆరోగ్య శాఖామంత్రి విడదల రజని, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ధర్మాన కృష్ణదాసు, పైల దేవదాసురెడ్డి, తడక యశోద, ఇప్పిలి లోలాక్షి తదితరులతో పాటు వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, పలువురు ఉన్నతాధికారులు పెద్దసంఖ్యలో పోలీసులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మానవహారం...

3వ రోజు నిరసనలు

విశాలాంధ్ర-కొత్తూరు : తమ దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లు సాగిస్తున్న నిరవధిక సమ్మె 3వ రోజున కొత్తూరు కేంద్రం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకముందు ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ తమ మద్దతును ప్రకటించారు. అధికారంలోకి వస్తే అంగన్‌వాడి సిబ్బంది సమస్యలు పరిష్కారం చేస్తామని, నాడు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డిని గత నాలుగేళ్లుగా అంగన్‌వాడి సిబ్బంది అడుగుతున్నా స్పందన లేదని ఆయన అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కొత్తూరు ఐసిడిఎస్ ప్రోజెక్ట్ పరిలోని అంగన్ వాడి కార్యకర్తలు, హెల్పెర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పరుగు పందాలకు సారవకోట క్రీడాకారుడి ఎంపిక

విశాలాంధ్ర-సారవకోట/జలుమూరు: మండలంలోని చిన్న కిట్టాలపాడు గ్రామానికి చెందిన ఎర్నాకుల రవికుమార్ కుమారుడు ఎర్నాకుల అయ్యప్ప రాష్ట్ర స్థాయిలో 400 మీటర్ల పరుగు పందెంలో ఎంపికైనట్లు తండ్రి రవికుమార్ తెలిపారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో జరిగిన పరుగు పందెంలో అయ్యప్ప ఎంపికయ్యాడు. అయ్యప్పకు మండల ప్రజలు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సీఎం సభలో వామపక్షాల నిరసన...

విశాలాంధ్ర-పలాస : శ్రీకాకుళం జిల్లా ను కరువు జిల్లాగా ప్రకటించాలని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలని, వంశధార కాలువను ఆధునికరించి ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరుతూ వామపక్షాల నాయకులు గురువారం పలాసలో జరిగిన సీఎం సభలో ప్లెకార్డులను ప్రదర్శన చేశారు. జిల్లాలో కరువు ఛాయలు అలుముకున్నాయని, తక్కువ వర్షపాతం నమోదయిందని యుద్ధ ప్రతిపాదికన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ సభలో కరువు జిల్లా గా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వంశధార,బహుద మహేంద్రతనయ నదులను ఇచ్చాపురం వరకు తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. వంశధార ఆధునికరణ చేస్తే రెండు లక్షల ఎకరాల వరకు నీరు అందుతుందని తద్వారా జిల్లాలో వలసలను నివారించవచ్చని వారు తెలిపారు. ఉద్దానం ఏజెన్సీ ప్రాంతంలో జీడిపంట జీవనాధారంగా రైతాంగం జీవిస్తున్నారని, జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలని 80 కేజీల బస్తాకు 16 వేల రూపాయలను గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వమే ఆర్బికేల ద్వారా కొనాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు చాపర వెంకటరమణ, సిపిఎం జిల్లా నాయకులు కోనారి మోహన్రావు, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిల రామారావు, సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి చాపర వేణుగోపాల్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు. వాసు, కొన్న. శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుబ్బ.భాస్కరరావు, దుబ్బ. భానుమతి, రైతు సంఘం జిల్లా నాయకులు తమ్మినేని భాస్కరరావు పాల్గొన్నారు.

ఈనెల 16న కలెక్టరేట్ వద్ద ఆందోళనను జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజ్ఞప్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కన్వీనింగ్ కమిటీ మరియు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక కామ్రేడ్. ఎస్ఆర్ దాసరి క్రాంతి భవనంలో సంఘం కన్వీనర్ జి.రామకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుడితి అప్పలనాయుడు, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి హాజరయ్యారు. మిచౌంగ తుఫాను ప్రభావం తీవ్రత లేకపోవచ్చు కానీ దాని వల్ల జిల్లాలో ఏకధాటిగా మూడు రోజుల పాటు కురిసిన వర్షం వల్ల కోసిన వరి చేలు ఓవులు, కుప్పలు తడిసిపోయాయి కొన్నిచోట్ల ధాన్యం మొలకలు వచ్చాయని, దీని ఫలితంగా ధాన్యం రంగు మారుతుందన్నారు. మిల్లర్లు రంగు మారిన ధాన్యం బూచి చూపి రైతులు నుంచి దోపిడీ చేయడానికి ఇదో ప్రధాన మార్గం అవుతుంది కనుక ప్రభుత్వం తక్షణమే తుఫానును జాతీయ విపత్తుగా గుర్తించి ఎఫ్‌సిఐ వారి నిబంధనలను సవరించి రైతులు పండించిన ధాన్యాన్ని అంతటినీ నేరుగా ప్రభుత్వమే ధాన్యం సేకరణ చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. జిల్లా యంత్రాంగం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పడమే తప్ప ఆచరణలో ధాన్యం సేకరణకు కావలసిన ప్రక్రియ వేగవతం కాలేదన్నారు. దీనికి కారణం మిల్లర్లు నుండి ఎదురవుతున్న ప్రశ్నలేనన్నారు. కనుక ప్రభుత్వం తుఫానును జాతీయ విపత్తుగా గుర్తించి రైతుల నుండి సేకరించాలని కోరారు. అలాగే కోరుతూ ఈనెల 16వ తేదీన శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆందోళన చేపడుతుందని, జయప్రదం చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. అదే సందర్భంలో వాస్తవ నష్టాన్ని నష్టపోయిన రైతులను గుర్తించి వరికి ఎకరాకు 50 వేలు, వాణిజ్య పంటలకు 75 వేలు, ఉద్యానవన పంటలకు లక్ష రూపాయలు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. రైతు సమస్యలపై జరుగు ధర్నాను భారత కమ్యూనిస్టు పార్టీ మద్దతిస్తుందని జిల్లా కార్యదర్శి బలగ శ్రీరా మ్మూర్తి తెలిపారు.

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 12వ జిల్లా మహాసభ జయప్రదం చేయండి... ఈనెల 31వ తేదీన శ్రీకాకుళంలో రైతు సంఘం జిల్లా 12వ మహాసభ జరుపుకుంటున్నామని దాన్ని జయప్రదం చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయంతో తీర్మానం చేయడం జరిగింది. సంఘ సభ్యత్వం గ్రామ కమిటీలు వేసి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అప్పలనాయుడు కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు చిక్కాల గోవిందరావు, కార్యదర్శి షణ్ముఖరావు, రైతు సంఘం జిల్లా నాయకులు సింతు ఎర్రయ్య, ఉప్పాడ సూర్యనారాయణ, మత్స్యకార సంఘం నాయకులు నాగుల తౌడు తదితరులు ఉన్నారు.

పోర్టు పనులను ముఖ్యమంత్రి పరిశీలన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేటలో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులను, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహన్ రెడ్డి గురువారం హెలికాప్టర్లో ప్రయాణం చేస్తున్న సమయంలో పరిశీలించారు. పలాస నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభించిన అనంతరం, తిరిగి అమరావతి వెళ్తున్న ప్రయాణంలో మూలిపేట పోర్టు ప్రాంతంలో హెలికాప్టర్లో నుంచి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోర్టు పనులు జరుగుతున్న ప్రాంతంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభ మండలి సభ్యులు దువ్వాడ శ్రీనివాసరావు అభివాదం చేశారు.

మోకాళ్లపై నిలబడి అంగన్వాడీల నిరసన

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం మోకాళ్లపై నిలబడి తమ నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిఐటీయు నేత లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థాయికి చేరుకోగలం

- తోటపాలెం ఎంపీ యూపీ పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించిన సూర శ్రీనివాసరావు
- విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-అరసవల్లి: సమాజంలో గౌరవం పొందాలన్నా, ఉన్నత స్థాయికి చేరుకోవాలని అది విద్యతోనే సాధ్యమవుతుందని ఎస్ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. తోటపాలెంలోని ఎంపీ యూపీ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు సూచన మేరకు పాఠశాలలో సూర శ్రీనివాసరావు తన సొంత నిధులతో ఏర్పాటుచేసిన సరస్వతీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రమ శిక్షణ కలిగిన విద్య సకల సంపదలను అందిస్తుందని విద్యార్థులకు వివరించారు. నిరంతరం శ్రమించడం, పట్టుదలతో కృషి చేయడంతోనే చదువుల్లో రాణించవచ్చునని పేర్కొన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదని, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో విద్యార్థులంతా మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదని భవిష్యత్తులో ఉన్న అతిధికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అంతా స్నేహ భావంతో మెలిగి విద్యలో పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్ కిట్లను, క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. భవిష్యత్తులో పాఠశాల అవసరాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కల్లేపల్లి తిరుపతిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీ నాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

విశాలాంధ్ర-కవిటీ : మండల తపాలా ఉద్యోగులు మండల కేంద్రమైన కవిటి తపాలా కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెకు దిగారు.ఈ మేరకు గురువారం కవిటి తపాలా కార్యాలయం వద్ద ప్లకార్డ్ లతో తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన అన్ని అంశాలు అమలు చేయాలని కోరారు. 8 గంటల పని దినాలతోపాటు పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు వర్తించేలా చేయాలని అన్నారు.సీనియర్ గ్రామీణ తపలా ఉద్యోగులకు 12,24,36 సంవత్సరాల ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలని కోరారు.గ్రామీణ తపాల ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని అన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్,గ్రాట్యుటీ ఐదు లక్షలకు పెంచాలని అన్నారు. గ్రామీణ తపాలా ఉద్యోగులు సెలవు తీసుకునేటప్పుడు వర్క్ లోడ్‌కు సంబంధం లేకుండా సబ్స్టిట్యూట్ కు అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపాల ఉద్యోగులు పూడి వంశీ మోహన్, కాయ మేఘనాదం, జల్లు రంజిత్, ఎం కవితా రాణి, నల్ల సౌమ్య, పి.శిల్ప, పి.కేశవరావు, పి.దాస్‌బాబు, ఎన్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు : కేంద్ర పిజెసిఎ పిలుపు మేరకు గ్రామీణ పోస్టల్లో పనిచేసిన జి డి ఎస్ ఉద్యోగులు నిరసన సమ్మె సైరాన్ మోగించారు. పొందూరు, లైదాం, ఎస్‌ఓ పరిధిలో గల పోస్టల్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు స్థానిక పోస్టాఫీస్ ముందు ప్లెకార్డులు చేతబుని నిరసన చేసారు. జిల్లా ఎన్ఎఫ్ పిఇ-జిడిఎస్ సహాయ కార్యదర్శి బెవర అప్పారావు సారధ్యంలో ఉద్యోగులు నిరసన నినాదాలు హోరెత్తించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పోస్టల్, ఆర్థిక సేవలు, ప్రభుత్వం పథకాలు అందిస్తున్న జి డి ఎస్ ఉద్యోగులకు తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని అలాగే పనికాలం తక్షణం నిర్వహించాలని కోరారు. ప్రభుత్యాహోదాలో అన్నిరకాల అల్లవెన్సులు, గ్రేట్యుయూటీ పెంపు, మెడికలబెనిఫిట్స్ కల్పించాలని కోరారు. గ్రామీణ తపాలా వ్యవస్థకు సంపూర్ణ ప్రభుత్వ హోదా కల్పించాలన్నారు. ఉద్యోగ సర్వీస్లకు అనుగుణంగా జిడిఎస్‌లకు తక్షణమే ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బి. చంద్రశేఖర్, వి.అప్పారావు, జి. కృష్ణారావు, బి. కైలాసరావు, కే. తవిటిరాజులతో కూడిన 50మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టంతో తీవ్ర నష్టం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం జి. ఓ నెం 512 తో తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేసారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐ.ఏ.ఎల్) స్థానిక యూనిట్ , ఇచ్చాపురం న్యాయవాదుల సంఘం సంయుక్తంగా నిరసన గళాన్ని వినిపించాయి. ఐ.ఏ.ఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో సమన్వయంతో స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేసి, అక్కడి నుండి పాత బస్టాండ్ కూడలి వరకు నడుచుకుంటూ వెళ్లి యాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేసారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు న్యాయం చేయటానికి నిరంతరం పనిచేస్తున్న న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి సామాన్య బడుగు బలహీన వర్గాల హక్కులను కాలరాస్తూ, న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని, న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజల హక్కులు నిర్ధారించే అవకాశాలు ఖచ్చితంగా ఉన్నప్పుడే సామాన్యులకు న్యాయం జరుగుతుందని, రెవిన్యూ అధికారులకు అటువంటి బాధ్యతలు బదలాయిస్తే ప్రజలకు తీవ్రమైన నష్టం తప్పదని, ఎవరి భూములు ఏమైపోతాయో, సన్న చిన్నకారు రైతులు ఎలాంటి తిప్పలు పడి భూములు కోల్పోవాల్సి వస్తుందో ఆలోచన చేయాలని ఐ.ఏ.ఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజ్ పాత్రో అన్నారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు మండల న్యాయస్థానాలు ఏర్పాటు వేగవంతం చేయాలనీ, బలహీనులకు అన్యాయం జరిగేలా ఉండే చట్టాలు సరైనవి కావని, అటువంటి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్. దేవరాజు, ఎన్వీ సాహూలు అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.ఎల్. నారాయణ, ఎన్.రమణయ్య, దక్కత కృష్ణమూర్తి, గిన్ని సీతయ్య, ఎన్వీఎస్ రంగారావు, భగవాన్ దాస్, పి. ప్రహ్లాద్, పి. వరలక్ష్మి, ఎం కె సామంత్, బి సూర్యనారాయణలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనలో పోలీసుల ఆంక్షలు

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి పలాస పర్యటన సందర్భంగా పోలీసుల అంక్షలు అధికమవ్వడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అనేక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు వెళ్లేందుకు దారులు లేకుండా పోయాయి. ముఖ్యమైన కూడలి వద్ద పోలీసు పహరా ఏర్పాటు చేసి 10 గంటలకే జంట పట్టణాలను వారి ఆధీనంలోకి తీసుకోవడంతో అనేక మంది ఇబ్బందులు పడ్డారు. కిడ్నీ ఆసుపత్రి ప్రారంభానికి ముందు గంట పాటు, బహిరంగ సభ అనంతరం రెండు గంటల పాటు ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. ముఖ్యమంత్రి సభలో పాల్గొనేందుకు పాసులు సంపాదించిన వారు సభలోకి వెళ్లేందుకు నానా అగచాట్లు పడాల్సి వచ్చింది. పాసులున్న జర్నలిస్టులకు కూడా పోలీసులు సభా వేదిక వద్దకు వెళ్లేందుకు నిరాకరించారు. దీంతో కొంతమంది జర్నలిస్టులు వెనుదిరిగారు. సభ విజయవంతం చేసేందుకు సుమారు 360 ఆర్టీసి బస్సులతో పాటు పలు ప్రైవేటు స్కూలు బస్సులు ఉపయోగించి ప్రజలను తరలించారు. సభా వేదిక వద్ద ప్రజలు నిండిపోయి వెలుపల ప్రాంతంలో నిలబడేందుకు కూడా స్థలం లేకపోవడంతో చాలా మంది కాలినడకన ఇంటికి పయనమయ్యారు.

వైసీపీ కౌన్సిలర్లకు అందని పాసులు : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన అధికార పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లకు ఆహ్వానం ఉన్నా విఐపి పాసులు అందజేయకపోవడంతో ముఖ్యమంత్రి సభలో పాల్గొనలేకపోయామని ఆవేదన చెందారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బొర క్రిష్ణారావు, మున్సిపల్ విప్ దుర్గాశంకర్ పండా, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, కౌన్సిలర్ ప్రతినిధి పోతనపల్లి హరిలు ముఖ్యమంత్రి సభలో పాల్గొనలేకపోయారు.

మంత్రి కుటుంబాన్ని హెలీప్యాడ్ వద్ద చుక్కెదురు : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి 200 పడకల కిడ్నీ ఆసుపత్రి ప్రారంభానికి పలాస వచ్చిన నేపధ్యంలో ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు ముఖ్యమంత్రిని ఆహ్వానం పలికేందుకు రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఆయన సతీమణి శ్రీదేవి, పిల్లలు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఆహ్వానం పలికిన వారిలో మంత్రి డాక్టర్ భార్య, పిల్లలు పేర్లు లేవని, హెలీప్యాడ్ వద్దకు పంపించడం కుదరదని పోలీసులు నిరాకరించారు. దీంతో జిల్లా ఎస్.పి రాధికకు మంత్రి డాక్టర్ సీదిరి ఫోన్ చేసి హెలీప్యాడ్ వద్దకు వెళ్లేందుకు తన భార్య కూడా ఇవ్వాలని అన్నారు. అక్కడ నుంచి కుటుంబ సభ్యులతో వెనుదిరిగి కిడ్నీ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. అనంతరం కిడ్నీ ఆసుపత్రి ప్రారంభించి ముఖ్యమంత్రి బహిరంగ సభకు వెళ్లగా మంత్రి డాక్టర్ సీదిరి సతీమణి బహిరంగ సభకు వెళ్లకుండా ఇంటిబాట పట్టారు.

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

చేతివృత్తుల వారికి జిల్లా బిజెపి అధ్యక్షులు ఎన్‌ఈఆర్ పిలుపు

విశాలాంధ్ర-రణస్థలం : బిజెపి ఎచ్చెర్ల క్యాంప్ కార్యాలయంలో విశ్వకర్మ యోజన స్కీంపై నాయకులకు, లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం బిజెపి విజయనగరం జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్) ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 రకాల చేతివృత్తుల వారికి ఆర్థిక సహాయం చేసే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించడం జరిగిందని, కేవలం 5 శాతం వడ్డీకే రూ. 3 లక్షల వరకు లోన్ అందించే ఈ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పీఎం విశ్వకర్మ స్కీమ్ పేరిట రూ.15 వేల కోట్ల రూపాయలు కేటాయించారని, ఈ స్కీమ్ 2023-24 నుంచి 2027-28 వరకు అయిదేళ్ల పాటు అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

వైసీపీది ఓటమి భయం

- రాష్ట్ర భవిష్యత్తు బాబు తోనే సాధ్యం - మాజీ మంత్రి కె ఎస్ జవహార్

విశాలాంధ్ర-ఆమదాలవలస : వైసీపీలో ఓటమి భయము పట్టుకుందని ఆ భయంతోనే ఇన్చార్జిల మార్పు చేపట్టిందని టిడిపి రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. గుంటూరు లో చెల్లని రూపాయి గూడూరులో చెల్లు తుందా అని అన్నారు. గురువారం కొర్లకోట కళ్యాణ మండపంలో నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ గుంటూరు లో చెల్లని రూపాయి గుడివాడలో ఎలా చెల్లు తోందని, దానిని ఎలాగైనా మార్పిడి చేయాలన్న ఉద్దేశంతో జగన్మోహన్ రెడ్డి చూస్తున్నారని ఎద్దేవా చేశారు. వైసిపి వారి గుండెల్లో ఓటమి భయాన్ని ప్రజలు గ్రహిం చారన్న విషయం దాని నుంచి ప్రజలు మనసు మార్చడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. వైసిపి బస్సు యాత్రలు గడప గడపకు అంటూ ఎన్ని కార్యక్రమాలు చేసినప్పటికీ ప్రజల్లో వ్యతిరేకత చోటు చేసుకోవడంతో జగన్మోహన్ రెడ్డి గుండెల్లో భయం పట్టు కుందన్నారు. భవిష్యత్ తరాల అభ్యున్నతి కోసం చంద్రబాబు నాయుడు పాటుపడుతున్నారని తెలిపారు. యువ గళం పేరిట లోకేష్ పాదయాత్ర కు అశేష జనవాహిని వస్తున్న నేపథ్యంలో ఆ సభలను చూసి వైసిపి వెన్నులో వణుకు పుట్టిందని వివరించారు. అలాంటి పాదయాత్రకి మనందరం సంఘీభావం తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రజా శ్రేయస్సు కోసం భాగస్వా ములు కావాలని పిలువునిచ్చారు. ఈ రాష్ట్రం భవిష్యత్తు కోసం మీరందరూ తెలుగుదేశం పార్టీకి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ అహర్నిశలు ప్రజా శ్రేయస్సు కోసం తెలుగు దేశం పార్టీ అధినేత పాటు పడుతున్నారని అటువంటి నేతలకు మనమంతా సంఘీభావం తెలపాలన్నారు. యువగళం పాద యాత్ర ముగింపు ఉత్సవానికి భోగా పురం తగరపువలస ప్రాంగణంలో ప్రతి ఒక్కరూ హాజరై పార్టీకి మద్దతు తెలపాలని రవి కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆనెపు రామకృష్ణ, పీరుకట్ల విశ్వ ప్రసాద్, మొదలవలస రమేష్, నూక రాజు, తమ్మినేని చంద్రశేఖర్, చాపర విజయలక్ష్మి, గౌరీపతి రావు, సంపద రావు మురళీధర్ రావు, చిగురుపల్లి రామ్మోహన్రావు నాలుగు మండలాల కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్‌కి అండగా జనసేన

- జనసేన టెక్కలి ఇన్‌చార్జి కణితి కిరణ్

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్రవ్యాప్తంగా గత రెండురోజులుగా అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ చేపడుతున్న రిలే నిరసన దీక్షకు మద్దతుగా గురువారం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు టెక్కలి జనసేన పార్టీ ఇంచార్జి కణితి కిరణ్ అంగన్వాడి అక్క చెల్లెళ్లు టెక్కలి తాసీల్దార్ ఆఫీస్ వద్ద చేపడుతున్న నిరసనలో పాల్గొని తమ మద్దతు తెలియచేశారు. ఈ సందర్భంగా కణితి కిరణ్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ తాలూకా న్యాయమైన కోర్కెలకు తమ మద్దతు తెలిపి వెంటనే వారికి రావాల్సిన బకాయిలను తీర్చాలని ప్రస్తుత ముఖ్యమంత్రి గతంలో తాను ప్రతిపక్ష నేతగా ఉండగా ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ వర్గ నాయకులు మెట్ట అవినాష్, గవరయ్య, కుమారస్వామి, త్రివేణి, వెంకటరమణ, హరి, గురయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మూడవరోజు సమ్మె పోరులో వేడెక్కిన అంగన్‌వాడీలు

జగన్ హామీని అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు గురువారం మూడవరోజు నిరవధిక సమ్మో పోరు కొనసాగించారు. అంగన్వాడీ సంఘం నాయకురాలు సుధతో కలిసి సిఐటీయు జిల్లా నాయకుడు హనుమంతు ఈశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని వారు ప్రధాన డిమాండ్ ఎక్కుపెట్టారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యూటి ఇవ్వాలని, గత ఆరు నెలల నుండి పెండింగ్లో పెట్టిన సెంటర్ అద్దెలు, టీఏబిల్లులు తక్షణం చెల్లించాలని జగన్ ప్రభుత్వానికి వారు డిమాండ్ చేశారు, ఆయాల ప్రమోషనల్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచి, రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నివారించాలని కోరారు. మినీ వర్కర్లును మెయిన్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు, ప్రమోషన్లు కల్పించాలని జగన్ సర్కార్‌కు గుర్తు చేశారు. నవరాత్నలు పేరుతో సీఎం జగన్ అందరికీ బటన్ నొక్కడం తప్ప అంగన్వాడీ వ్యవస్థకు సున్నం రాస్తున్నారని మండి పడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో కోటబొమ్మాళి ప్రాజెక్టు పరిధిలోగల అన్ని అంగన్వాడీ కేంద్రాల వర్కర్లు, ఆయాలు పాల్గొని నిరసన తెలియజేశారు. అలాగే అంగన్వాడీలకు సమ్మెకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, యుటీఎఫ్ జనరల్ కార్యదర్శి కె.వైకుంఠరావు, దాలయ్య తదితరులు నిరసన తెలియజేశారు.

ఇచ్ఛాపురం : సమస్యల పరిష్కారం కోరుతు నిరసన బాట పట్టిన అంగన్వాడీ కార్యకర్తల దీక్షలు మూడవ రోజు కొనసాగించారు. పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో గురువారం అంగన్వాడీ వర్కర్లు కళ్ళకు గంతలు కట్టుకుని, మోకాలిపై నిల్చుని నిరసన తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేలా చర్యలు చేపట్టి, తమకు కనీసం 26వేల రూపాయల వేతనాన్ని అందివ్వాలని, అంగన్వాడీ కేంద్రాల పరిధిలో లబ్ధిదారులకు పౌష్టికాహారాన్ని సరఫరా చేయించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషన్ ప్రతినిధులు హైమావతి, విజయ, బాల, సుబ్బలక్ష్మి, సురేఖ, సరస్వతి, జయలక్ష్మి, కోమలి తదితరులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

మరోసారి బీసీలను మోసం చేయలేరు

నాయీబ్రహ్మణ బిసి సాదికారిత పార్లమెంటు కమిటి కన్వీనర్ వెంకటరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రస్తుత ప్రభుత్వం బీసీలకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తానని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, మళ్ళి ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో బీసీలకు మళ్ళి మభ్యపెడుతున్నారని మరోసారి బీసీలకు మోసం చేయలేరని నాయీబ్రహ్మణ బీసీ సాధికారిత పార్లమెంటు కమిటి కన్వీనర్ కుప్పిలి వెంకటరావు, జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు నౌగాపు నాగరాజులు అన్నారు. భవిష్యత్తుకు భరోసా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో నాయీబ్రాహ్మణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల వెనుకబాటుతనంతో పాటు జరుగుబాటు తనం లేక అనేక కుటుంబాలు సతమతముతున్నాయి. ఇలాంటి కుటుంబాలను గుర్తిస్తున్నామని అటువంటి వారిని రాబోయే తెలుగుదేశం ప్రభుత్వం గుర్తించి అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు జిల్లాలో తమ కులాలు ఉన్న అన్ని గ్రామాలు పర్యటిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నౌగాపు సుశీల, చిగురువలస రాజేశ్వరి, పోతల రామదాసు, పోతల అప్పారావు, తెలగవలస శంకరరావు, టి. మోహనరావు, ప్రసాద్, మహిళ నాయీబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం సభకు సంతబొమ్మాళి మండల నాయకులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సభకు సంతబొమ్మాళి మండలం నాయకులు వెళ్లారు. గురువారము పలాస నియోజక వర్గంలో కిడ్నీ ఆసుపత్రి, వైఎస్సార్ సుజలధార వంటి ప్రాజెక్టులు ప్రారంభోత్సవానికి విచ్చేసిన కార్యకంలో వీరు పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో సంతబొమ్మాళి మండలం ఎంపిపి మేరుగు రాజేశ్వరీ అప్పారావు, సంతబొమ్మాళి మండలం సచివాలయాల కన్వీనర్లు సంఘాల అధ్యక్షులు మోడి భాస్కర రెడ్డి, రుంకుహనుమంతురం పంచాయితీ సర్పంచ్ ఎన్ని మాన్మధరావు తో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు జన్‌ఆరోగ్య యోజన కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పై అవగాహన పెంచుకోవాలని మండల బిజేపి అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు అన్నారు. ఆయన గురువారం మండలంలో గల తిలారు పంచాయతీలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తోందని, వీటిపై గ్రామీణ స్థాయిలో చాలా మందికి అవగాహన లేకపోవడం వల్ల లబ్ధి చేకూరడం లేదని ప్రభుత్వం దృష్టికి వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ప్రధానమంత్రి జన్ అరోగ్య యోజన కార్డులను, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్‌ను అందజేశారు. అంతకుముందు కేంద్రపథకాలను వివరించే 2024 సంక్షేమ క్యాలండర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితర నాయకులు పాల్గొన్నారు.

మాట తప్పే చంద్రబాబును ప్రజలు నమ్మవద్దు

- ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మాట తప్పే చంద్రబాబును ప్రజలు అసలు నమ్మవద్దని, చెప్పిన మాట నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. గురువారం మండలం వాంద్రాడ సచివాలయం నందు వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 2019లో ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెలవేర్చిన మన జగనన్న పాలన గురించి ప్రతి గడపలో తెలియజేయడమే వైఏపీనీడ్స్ జగన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ముందుగా లబ్ధిదారుల సమాచార పట్టిక (డిస్‌ప్లే)ను అవిష్కరించిన అనంతరం వైయస్సార్సీపి జెండాను మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజుతో కలిసి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పొరపాటున చంద్రబాబు వస్తే 75 శాతం సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, అందుకే ప్రజలంతా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంక్షేమ పథకాలు మీ ఇంటికి తీసుకువస్తున్న జగనన్న ప్రభుత్వానికి ఓటువేసి జగన్మోహన్‌రెడ్డిని మళ్లి ముఖ్యమంత్రిని చేద్దామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు స్థానిక జేఎస్‌సీ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, ఎంపీటీసీ వాన అసిరినాయుడు వైకాపా నాయకులు పేడాడ వెంకటరావు, మెట్ట సింహాచలం, సింగుపురం వినోద్, హనుమంతు తేజ, పంకు రాము, వెలమల తాంతారావు, యంఎల్‌వో తారక్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చుని అంగన్వాడీ సిబ్బంది నిరసన

విశాలాంధ్ర-ఎచ్చర్ల : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ సిబ్బంది ఎచ్చెర్లలో గురువారం మోకాళ్ళపై కూర్చొని వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు జీతాలు పెంచాలని గ్రాట్యుటీ ఇవ్వాలని కారుణ్య నియామకాలు వర్తింపజేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ని రమణ అంగన్వాడీ సిబ్బంది ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

వైసీపీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది

- బాబు భవిష్యత్ గ్యారెంటీతో ప్రజల్లో గ్యారెంటీ వచ్చింది
- 20న యువగళం 6లక్షల మందితో విజయవంతం చేద్దాం
- టెక్కలి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్రంలో వైసీపీకి కౌంట్ డౌన్ ప్రారంభమైందని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన బాబు ష్యూరీటి- భవిష్యత్తు గ్యారెంటీపై అన్ని వర్గాలు, అన్ని పార్టీలు ప్రజలకు గ్యారెంటీ వచ్చిందని అయితే మండల నాయకులు మరింత శ్రద్ధ చూపిస్తే త్వరిత గతిన ప్రక్రియ పూర్తిచేయగల మన్నారు. ఈనెల 31లోగా 80 శాతం భవిష్యత్తు ష్యూరీటి కార్యక్రమం పూర్తి కావాలని అయన పిలుపు నిచ్చారు. అందుకోసం బూత్ కమిటి సభ్యులను పోటీతత్వం పెంచాలన్నారు. అయితే టిడిపి అవిర్భావం నుంచి ఎన్నో ఎన్నికలు చూశాం, ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాం కానీ పెద్దల నుంచి పిల్లల వరకు కింది స్థాయి నుంచి వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రాజెక్టుల భవిష్యత్తును నాశనం చేసే దుర్మార్గమైన సీఎం జగన్మోహన్‌రెడ్డి యేనని అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు పోటీకాదని, 5కోట్ల ప్రజలకు, జగన్మోహన్‌రెడ్డికి జరగబోయే పోటీయని ఆయన అన్నారు. కేవలం నాలుగున్నరేళ్లల్లో ఆంధ్రప్రదేశ్ పాతాలానికి తొక్కి నాశనం చేశారని, ఈ శని ఎప్పుడు పోతుందాయని 5 కోట్ల ప్రజానీకం ఎదురు చూస్తున్నారన్నారు. మోసపూరిత హామీలిచ్చి కేవలం అందులో 38 శాతం మాత్రమే నెరవేర్చారన్నారు. దాడులు, దమరకాండలు, హత్యలు, దళితులు పై దాడులు, మహిళలపై అత్యాచారాలు, కూల్చివేతలతో నరరూపరాక్షసుడుగా వ్యవహరిస్తున్నాడని, వీటిలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయని దీనిపై నాలుగు రోజుల్లో పుస్తకాలు విడుదల చేయనున్నామన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను గాలికొదిలి, ఇప్పుడు ఎన్నికలు ముందు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకుంటే ఏప్రిల్లో పోస్టులు తీసా మని చెబుతున్నారని అయితే నీ ఆయువు మార్చి వరకే అయితే ఏప్రిల్లో ఎలా ఇస్తావని ఆయన ఎద్దేవ చేశారు. ఉద్దానానికి ఎంతో ఉద్దరిస్తున్నామని చెప్పి డబ్బాలు కొట్టుకుంటున్న మీకు ఏమాత్రమైన సిగ్గుందాయని ఆయన ప్రశ్నించారు. 2022లో జీవో నెంబర్ 11ను విడుదల చేసి పలాసాలో ఐదు ఎకరాల స్థల సేకరణచేసి స్వయంగా నేనే భూమి పూజ చేశానని, ఆ నిధులుతోనే అసుపత్రి పూరి చేసి ఈ నాలుగున్నర ఏళ్లు గాలికి వదిలేని ఇప్పుడు ప్రారంభానికి హడావుడి చేశారని, చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు శ్రీకాకుళం, పాలకొండ, ఇచ్ఛాపురం. కవిటి, పలాసా, టెక్కలిలకు డయాల్సిస్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ముందుగా టెక్కలి డయాల్సిస్ కేంద్రాన్ని స్వయంగా నేనే ప్రారంభించానని, తరువాత ఎన్నికల రావడంతో వాటిని మరుగున పడేసి వాటన్నింటిని కలిపి పలాసాలో వేయటం వలస చుట్టు పక్కల రోగులు ఇబ్బందులకు గురవుతారని ఆయన స్పష్టం చేశారు. ఉద్దాన నీటి పథకం అనాడు ఎర్రన్నాయుడు తీసుకువస్తే ఆ ట్యాంకులకు కేంద్ర ప్రభుత్వం సుజలదారా ద్వారా నీరు ఇచ్చి వారేదో చేసుకున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. టిడిపి కాలంలో 16 ఎత్తుపోతల పథకాలు ద్వారా జిల్లా సస్యశ్యామలం చేస్తే ఇప్పుడు నాలుగున్న ఏళ్ళులో వాటిని వినియోగించటం చాత కాక జిల్లాను కరువు జిల్లాగా తయారు చేశారని, శ్రీకాకుళం జిల్లాలో ఒక్క మండలన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం ఇక్కడ అధికార పార్టీ మంత్రులు నేతలు అసమద్ధతకు నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. శ్రీకాకుళం జిల్లాలో పండించిన ప్రతి గింజకు నిబంధనలు లేకుండా గిట్టుబాటు ధర కల్పించి రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే రైతులతో కలిపి రోడ్లెక్కి పోరాటాలు చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులు సైతం నెలలు తరబడి రైతులకు తిప్పకుండా వారం రోజుల్లో డబ్బులు చెల్లించాలన్నారు. ఈ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ రాష్ట్రమంతట అవినీతి కోరల్లో కూరికిపోవటంతో జగన్‌కు నిద్ర పట్టక కొత్త నినాదాం అలపిస్తూ ఎమ్మెల్యేలు మార్చటం జరుగుతుందని ఇక్కడ చెల్లని నాణ్యం ఎక్కడైన చెల్లదని ఆయన సమత్కరించారు. పులివెందులలో బిసీలను నిలబెట్టేదమ్మునీకు ఉందాయని ఆయన జగన్‌మోహన్‌రెడ్డికి ప్రశ్నించారు. రాష్ట్రంలో 160 స్థానాలు టిడిపి కైవస్యం చేసుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. మన ఆయుదం మనం చేసిన అభివృద్ధియేనని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షుడులు పినకాన అజయ్‌కుమార్, బగాది శేషగిరి, బోయిన రమేష్, జీరు భీమారావు, మాజీ ఎంపీపీలు వెలమల కామేశ్వరరావు, తర్ర రామక్రిష్ణ, కర్రి విష్ణుమూర్తి, మట్ట సుందరమ్మ, చౌదరి బాబ్జి, రాష్ట్ర కార్యదర్శి ఎల్.ఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక పోస్టల్ కార్యాలయం వద్ద గురువారం మూడవ రోజు ధర్నాకు దిగారు. డాక్ సేవక్‌లకు సివిల్ సర్వెంట్ హెూదా కల్పించాలని, గ్రామాల్లో పనిచేసే వారికి 8 గంటలు పని విధానం అలాగే మరో ఐదు డిమాండ్ల ఎ. డాక్ సేవక్‌ల సమ్మెతో గ్రామాల్లో తపాలా సేవలు నిలిచి పోయాయి. ఈ నిరసన కార్యక్రమంలో కోటబొమ్మాళి పోస్టల్ కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులు, గ్రామీణ డాక్ సేవక్‌లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-మందస : జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం సౌజన్యంతో ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి సోంపేట అధ్వర్యంలో గురువారం మందస గ్రామం లో ఒరియా యంగ్ మెన్స్ లైబ్రరీ లో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత కంటి శిబిరంలో 35 మందికి కంటి పరీక్షలు చేయడం జరిగింది. మరియు 10 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. 18 మందికి మందులు అందచేశారు.ఏడుగురికి కళ్ళ అద్దాలు అవసరమని నిర్ధారించారు. ఈ కంటి శిబిరంలో ఒరియా యంగ్ మెన్స్ లైబ్రరీ సభాపతి దుర్గ ప్రసాద్ పాణిగ్రహీ కమిటీ సభ్యులు, ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి వైద్య సహాయకులు పి.ఉగ్రసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పెద్దలను కలుస్తున్న సిరిపురం

విశాలాంధ్ర-హిరమండలం : 'యువతకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా పాతపట్నం నియోజకవర్గ సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు హిరమండలం మండలంలోని పలు గ్రామాల పెద్దలు, ప్రజా ప్రతినిధులతో గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిరిపురం తేజేశ్వరరావు అక్కరాపల్లి, పింద్రువాడ, అంబావల్లి, పెద్ద కిట్టాలపాడు గ్రామాలలో పర్యటించారు. అక్కరాపల్లి మాజి సర్పంచ్ గోళ్ల సింహాచలం, పింద్రువాడ సర్పంచ్ మండ దండాసి మాకవరం ఎంపిటిసి చీకటి రాజు, పెద్దకిట్టాలపాడు మాజీ సర్పంచ్ గొంటి లజపతిరావు, కలిసెట్టి గౌరి,మాజీ ఎంపిటిసి రాయి శ్రీను, తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో "ప్రజా అభ్యర్థి"గా పోటీ చేస్తానని తనను ఆశీర్వదించాలని కోరారు. పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధి కోసం రూపొందించిన సిరిపురం మేనిఫెస్టోలోని అంశాలను వారికి వివరించారు.

పాత మేఘవరంలో చోరీ

ఐదు తులాల బంగారం, 50 వేల రూపాయలు నగదు అపహరణ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి - ఈ మండలం మేఘవరం పంచాయతీ పాతమేఘవరం గ్రామానికి చెందిన తై సోములు ఇంట్లో చోరీ జరిగినట్లు సంతబొమ్మలు పోలీసులు తెలిపారు. ఐదు తులాల బంగారం, 50 వేల రూపాయలు నగదు పోయినట్లు, ఎవరు దొంగిలించారు అనేది తెలియదని బాధితులు సోములు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మలు పోలీసులు తెలిపారు.

ఇంజాద్రి కొండపై ప్రత్యేక పూజలు

- జలకలింగుపురం, ముకుందపురం గ్రామస్తులు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: జలకలింగుపురం, ముకుందపురం గ్రామాలకు సుదూరంలో ఉన్న ఇంజాద్రికొండపై గ్రామస్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలకి వెళ్తే ఇటీవల గత కొంతకాలంగా ఇంజాద్రి కొండ వార్తల్లో నిలుస్తున్న నేపథ్యంలో గురువారం నాడు జలకలింగపురంతో పాటు పరిసర ప్రాంత ప్రజలంతా మూకుమ్మడిగా ముగ్రాటలతో కొండ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వద్ద గ్రామానికి సుదూరంలో ఇంజాద్రి కొండ ఉన్నప్పటికీ ఆ రెవెన్యూ గ్రామానికి సంబంధం లేదని, మా గ్రామస్తుల విశ్వాసాలను పరిగణలోకి తీసుకోకుండా గ్రానైట్ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులివ్వడం సబబు కాదని తక్షణమే వాటిని రద్దు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తున్నారు. గ్రానైట్ క్వారీ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ ఇటీవల కాలంలో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వారికి సైతం కలిసి విన్నవించినట్లు సైతం వారు తెలియజేస్తున్నారు. పరిసర ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బ తినకుండా గ్రానైట్ క్వారీ కొనసాగింపు చర్య పై ప్రభుత్వం పుణరాలోచన చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో మర్రిపాడు సి సర్పంచ్ రవ్వల అనురాధ, సర్పంచ్ ప్రతినిధి గణపతిరావు, జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, ముకుందపురం సర్పంచ్ సవర భాస్కరరావు, గ్రామస్తులు మహిళలు, భక్తులు, తదితర ప్రాంత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పీర్ల యాత్ర

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మార్గశిర మాసం మొదలైతే చాలు మతాలకు అతీతంగా పీర్లకొండ వద్ద భారీ జన సందోహం నెలకొంటుంది. చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు సుదూర ప్రాంత వాసులు కూడా ఇక్కడకు చేరుకుని పీర్లయాత్రలో పాల్గొంటారు. ముస్లింలు నిర్వహించే పీర్ల కొండకు మార్గశిర గురువారాల్లో ఇండ్ల వద్ద భక్తి ప్రవత్తులతో లక్ష్మిదేవిని కొలిచే హిందూ భక్తులు అధిక సంఖ్యలో కొండపై బాబా షక్కర్ గంజ్ సమాదిని దర్శించి నివేదనలు చేస్తారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పీర్లయాత్ర సందర్భంగా కొండను సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించే యువత కూడా పెద్ద సంఖ్యలో చేరుకుంటారు. కంద్ర కులస్థులు మేళతాళాలతో పీర్ల యాత్ర సందర్భంగా ప్రసాదాలను సమర్పిస్తుంటారు. బాబాను మొక్కు కోవడం ద్వారా సమస్యలు పరిష్కారమై కోరికలు తీరిన వారు మొక్కులు చెల్లించుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చారు. మత సామరస్యానికి ఉత్తరాంధ్ర ముఖద్వార ప్రాంతమైన ఇచ్ఛాపురంలో పీర్ల యాత్ర ప్రతీకగా నిలుస్తుంది. ఏడాదికి ఒకసారి మార్గశిర మాసంలో నాలుగు వారాల పాటు భారీ జనాలతో జరిగే యాత్రకు ప్రభుత్వం తరపున ఎటువంటి ప్రోత్సాహ సహకారాలు మాత్రం ఉండట్లేదు. కొండ మొదటి మెట్టు వద్ద దూప దీపాలు సమర్పించే ప్రాంతం వరకూ జగనన్న కాలనీ ఇళ్ళను కేటాయించడంతో కొండకు వెళ్ళే మార్గం ఇరుకుగా మారి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని, భవిష్యత్ తరాలు మత సామరస్యత కోసం చెప్పుకోవడానికి ఆనవాలుగా ఉండే కొండ వాలు ప్రాంతాన్ని భూ బకాసురులు బొక్కేస్తుంటే, అధికారులే కొమ్ము కాస్తున్నారని, ఇప్పటికే క్వారీ తవ్వకాల వల్ల కొండ భాగం చాలా వరకూ కనుమరుగైపోయిందని గురువారం కొండయాత్రకు వచ్చిన చాలా మంది గుసగుసలాడుకున్నారు.

వినియోగదారుల అవగాహనతోనే మోసాలకు అడ్డుకట్ట...

తూనికల కొలతలు శాఖ జిల్లా అధికారి విశ్వేశ్వరావు...

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : వినియోగదారుల అవగాహనాతోనే మార్కెట్లో జరిగే మోసాలకు అడ్డుకట్ట వెయ్యొచ్చని తూనికలు కొలతలు శాఖ సహాయ కంట్రోలర్ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. ఈనెల 24న నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్ (ఆశ్రా,)సంస్థ కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలో టిపిఎమ్ హైస్కూల్, మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ లో విద్యార్థులకు వినియోగదారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తూనికలు కొలతలు శాఖ సహాయ కంట్రోలర్ విశ్వేశ్వరావు, ఇన్స్పెక్టర్ రాజా రమేష్ తూనికలు కొలతలు పనిముట్ల ను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహనా కల్పించారు. విద్యార్థి దశనుండి చట్టం పై అవగాహనా ఉండడం ద్వారా మోసాలు అరికట్టడం సాధ్యమన్నారు. సీనియర్ న్యాయవాది, వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ ఇందిరా ప్రసాద్ వినియోగదారులు చట్టం 2019, వినియోగదారుల హక్కులు భాద్యతలు గురుంచి విద్యార్థులకు సోదాహరణము గా వివరించారు. ఆశ్రా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఏజ్రా అధ్యక్షతన జరిగిన ఈ అవగాహనా సదస్సులో ప్రధానోపాధ్యాయులు ఆశ్రా ప్రతినిధులు లఖినాన. రవికుమార్, కట్టా పార్ధ సారధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ట్రిపుల్ ఐటి విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-ఎచ్చర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పియుసి 1 విద్యార్థిని సిహెచ్ పల్లవి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది ఈనెల 8న విజయనగరంలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లో పల్లవి ప్రతిభ కనబరిచి గుజరాత్ లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయింది ఈ విద్యార్థిని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి డిజి బాలాజీ, ఓ ఎస్ డి ప్రొఫెసర్ ఎల్ సుధాకర్ బాబు ఏవో ముని రామకృష్ణ చౌదరి తదితరులు అభినందించారు.

బిఆర్ఏయు పురుషుల హాస్టల్ వర్చువల్‌గా ప్రారంభం

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ లో నిర్మించిన పురుషుల వసతి గృహాన్ని సీఎం జగన్మోహన్ రెడ్డి వర్చువల్గా పలాసలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె హేమచంద్రారెడ్డి వర్సిటీ వీసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఫోటో: సీఎం జగన్మోహన్ రెడ్డి వర్చువల్ గా శిలాఫలకం ఓపెన్ చేస్తున్న దృశ్యం

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

ఇచ్ఛాపురం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాలం అశోక్

విశాలాంధ్ర-కవిటి : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ అన్నారు. ఈమేరకు గురువారం మండలం లోని కపాసుకుద్ది గ్రామంలో గ్రామస్తుల ఆర్థిక సహకారముతో మర్ల పోలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే బెందాలం అశోక్ చేతులమీదుగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బెందాలం అశోక్‌చే పురోహితుడు నిరంజన్ ప్రత్యేక పూజలు చేపట్టి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ధాన్యం దగ్ధం

విశాలాంధ్ర-మెళియాపుట్టి: వరిచేను కోసి పొలంలో మండిగా నున్న ధాన్యం కుప్ప అగ్ని ప్రమాదానికి గురైంది. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే మెళియాపుట్టి మండలం, పద్ద పంచాయతీకి సంబంధించిన మజ్జి పద్మనాభంకి చెందిన ఎకరా 20 సెంట్లు సంబంధించి ధాన్యం గురువారం అగ్ని ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ వైకుంఠరావులు అగ్ని ప్రమాదం జరిగిన స్థలానికి వెళ్లి అగ్నిప్రమాదం ఎలా సంభవించింది తదితర వివరాలను తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంకు సంబంధించి నివేదికను పైఅధికారులకు నివేదించ నున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్శనలో ఆయనతోపాటు వీఆర్వో శామ్యూల్ తదితరులు ఉన్నారు.

మెళియాపుట్టి కార్యదర్శిగా అప్పారావు అదనపు బాధ్యతలు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మెళియాపుట్టి పంచాయతీ కార్యదర్శిగా చింతాడ అప్పారావు ఇన్చార్జి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో చంద్రకుమారి ఆదేశాల మేరకు ఇన్చార్జి కార్యదర్శి గురువారం నాడు బాధ్యతలు చేపట్టారు. వసుంధర కార్యదర్శిగా పనిచేస్తున్న బి. కృష్ణారావు ఇప్పటివరకు మెలియాపుట్టి పంచాయతీ పంచాయతీ ఇన్చార్జి కార్యదర్శిగా పనిచేశారు. ఇప్పుడు పద్ద పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న అప్పారావుకు మెలియాపుట్టి ఇన్చార్జి కార్యదర్శిగా నియమించారు. గతంలో ఇదే పంచాయతీకి ఇన్చార్జి కార్యదర్శిగా అప్పారావు పనిచేశారు.

శ్రీముఖలింగంలో శివ స్వాముల మాల విసర్జన

విశాలాంధ్ర-జలుమూరు : మండలంలోని శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వరుని ఆలయంలో శివ స్వాములు మాల విసర్జన కార్యక్రమం నిర్వహించారు. ఒరిస్సా, తెలంగాణ, ఇతర ప్రాంతాల నుండి శివమాల ధరించిన స్వాములు ప్రతి ఏడాది శ్రీముఖలింగేశ్వరుని సన్నిధిలో మాల విసర్జన చేయడం సాంప్రదాయకంగా కొనసాగుతుందని వారు తెలిపారు. ఈ క్రమంలో ఆలయంలో స్థానిక అర్చకులు ప్రత్యేక పూజలను చేపట్టారు.